క్లుప్తంగా

కేసీఆర్, కోనప్ప, కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రైతులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. పోడు పట్టాల కోసం కోనేరు కృష్ణారావు రైతుల పక్షాన పోరాటం చేశారని తెలిపారు. సర్పంచ్ పోరేతు చరందాస్, నాయకులు బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ఎంపీపీ

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీపీ ముండే విమలబాయి సోమవారం సందర్శించారు. భోజనం మెనూను పరిశీలించారు. కుళ్లిపోయిన ఆహార పదార్థాలతో వంటలు చేయొద్దని సిబ్బందిని హెచ్చరించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. 8వ తరగతి గదిలో పై కప్పు నుంచి వర్షపు నీరు వస్తుందని విద్యార్థిని ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా..సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోమటిగూడ సర్పంచ్ మంగళ, సామేల సర్పంచ్ మారుతి, బీఆర్ఎస్ నాయకుడు దీపక్ ముండే తదితరులు ఉన్నారు.

రైతులకు బీమాతోనే ధీమా



చెక్కు అందజేస్తున్న ఎస్బీఐ మేనేజర్

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు బీమా చేసుకుంటే ధీమాగా ఉండవచ్చని ఎస్బీఐ మేనేజర్ రవికుమార్ అన్నారు. బీమా తీసుకున్న రైతులకు పరిహారం చెక్కును సోమవారం ఆయన అందజేశారు. బ్యాంకులో రుణం తీసుకునే సమయంలో ఆరోగ్య బీమా చేసుకునే ఖాతాదారులకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రతి రైతు ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకంలో ఏడాదికి రూ.436 చెల్లిస్తే ఎలాంటి మరణం పొందినా కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు బీమా వస్తుందన్నారు. ఆరోగ్య బీమా తీసుకొని అనారోగ్యంతో అస్పత్రిలో చేరిన లక్ష్మికి రూ.37 వేల చెక్కును అందజేశారు. ఎఫ్‌వో రాజ్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్ రాం విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎంపీపీ పెందోర్ మోతీరాం సోమవారం భూమిపూజ చేశారు. బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో గల స్థలంలో గద్దె నిర్మాణం తర్వాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఎంపీపీ తెలిపారు. వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇప్తేకార్, నాయకులు లక్ష్మి, వెంకటేశ్, వినేష్, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ ఉత్తం, యూనూస్, రఘునాథ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

వాంకిడి: రహదారులపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ అన్నారు. మండల పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. వాహనదారులు అతి వేగంతో కాకుండా గమ్యానికి సురక్షితంగా చేరేలా ప్రయాణాలు సాగించాలన్నారు. ఎన్‌హెచ్ ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

శిథిలావస్థలో బడి భవనాలు

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



రైల్వేస్టేషన్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శిథిలావస్థకు తరగతి గదులు



అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల భవనం

సిర్పూర్(టి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు, తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలతో ముప్పు ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులకు ఇతర తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. దీంతో తరగతి గదులు సరిపోక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలోని పాత గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా ఆ గదుల్లో విద్యార్థులు ఆటలు ఆడుతుంటారు. ఎప్పుడు కూలుతాయో తెలియని భవనాల మధ్య విద్యార్థులు గడుపుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలోని ఒక గది పైకప్పు పెంకులు ఊడిపడుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం నిధులు మంజూరు కాగా, పనులు సైతం ప్రారంభించారు. కానీ నిధుల లేమితో నిర్మాణం అసంపూర్తిగానే నిలిచింది. మండలంలోని లోనవెల్లి, కేశవపట్నం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లోని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదపుటంచున..



ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులు, భవనాలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ కాలనీలోని పాఠశాల గదులు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరుకున్న భవనాలను తొలగించి నూతన భవనాలు మంజూరు చేయాలి.

– దేవీదాసు, సిర్పూర్(టి)

అధికారులు స్పందించాలి



మండల కేంద్రంలోని పలు పాఠశాలల భవనాలతో పాటు మండలంలోని గ్రామాల్లో గల పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్లుగా భవనాలు శిథిలావస్థలో ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– మల్కరి ప్రసాద్, సిర్పూర్ (టి)

అద్దెకు యంత్రాలు

- మండల సమాఖ్య సరికొత్త నిర్ణయం
- తక్కువ ధరకు యంత్రాలు.. రైతులకు ఉపయోగం



సిద్ధంగా ఉన్న యంత్రాలు

తిర్యాణి: ప్రస్తుత రోజుల్లో సాగులో యంత్రాలు వాడకం తప్పనిసరి. కూలీలతో చేసే పనులకు యంత్రాలు చేస్తుండడంతో వీటి వాడకం పెరిగిపోతోంది. సొంత యంత్రాలు లేక రైతులు తిప్పలు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద వాటిని అద్దె తీసుకోవడంతో వారిపై ఆర్థికభారం పడుతోంది. ఈ నేపథ్యంలో మండల సమాఖ్య సరికొత్త నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే రోజువారీ అద్దె రూపంలో యంత్రాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో అటు మండల సమాఖ్య ఆర్థిక అభివృద్ధి చెందడంతోపాటు ఇటు రైతులకు సైతం లబ్ధి చేకూరనుంది.

రైతులతో ఒప్పందం

మండల సమాఖ్య సభ్యులు రైతులకు యంత్రాలను ఇచ్చే సమయంలో వారి నుంచి ఒప్పందం చేసుకుంటారు. ఎన్ని రోజులకు అద్దె తీసుకుంటున్నారో అందుకయ్యే రుసుములో 50 శాతం ముందుగా అడ్వాన్సు కింద చెల్లించాల్సి ఉంటుంది. అద్దెకు తీసుకున్న సమయంలో యంత్రాల పరికరాలు చెడిపోవడం లేదా మరమ్మతుకు గురైతే వాటి భారం రైతులే చెల్లించాల్సి ఉంటుంది. తప్పనిసరిగా పట్టా పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్‌ను అందించాల్సి ఉంటుంది.

అద్దెకు లభించే యంత్రాలు ఇవే..

జంగుబాయి సమాఖ్య కార్యాలయంలో వద్ద మొత్తం 11 రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి రోజుకు లెక్కన అద్దెకు ఇస్తుంటారు. ట్రాక్టర్ రూ.1400, ట్రాలీ రూ.600, ప్లౌవ్ రూ.500, కల్టివేటర్ రూ.500, కాటన్ షెడ్డర్, రోటవేటర్ రూ.వెయ్యి, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లర్ రూ.వెయ్యి, పవర్ వీడర్ రూ.500, బూమ్ స్ప్రేయర్ రూ.వెయ్యి, టైవాన్ స్ప్రేయర్ రూ.200, బ్యాటరీ స్ప్రేయర్ రూ.100 రోజు వారీ అద్దెగా నిర్ణయించారు. కాగా, ఆ యంత్రాల అద్దెకు తీసుకోవడానికి మండలంలోని రైతులతోపాటు ఇతర మండలానికి చెందినవారు తీసుకునే వెసులుబాటు ఉంది.

తక్కువ ధరకు యంత్రాలు



మండల సమాఖ్య కార్యాలయంలో తక్కువ ధరకు యంత్రాలను అద్దెకు ఇస్తున్నాం. ఇందుకోసం రైతుతో ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్ కన్నా ఇక్కడ తక్కువ ధరకే యంత్రాలు ఇస్తుండటంతో రైతుల నుంచి స్పందన బాగుంది.

– సదానందం, ఏపీఎం, తిర్యాణి

చినుకుపడితే చిత్తడే..



బురదమయమైన ఆరెగూడ గ్రామ రోడ్డు

- రాకపోకలకు ఇబ్బంది
- మోకాల్లోతు గుంతలు
- ఇక్కట్లు పడుతున్న గ్రామస్తులు

కాగజ్‌నగర్‌రూరల్: చినుకుపడితే చాలు ఆ గ్రామంలోని రోడ్లన్నీ చిత్తడవుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయలేక నానా యాతన పడుతున్నారు కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ గ్రామస్తులు. నూతన రోడ్డు నిర్మించేందుకు మొరం వేసి వదిలేయడంతో వర్షం కురిసినప్పుడల్లా బురదమయంగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ గ్రామంలో సుమారు 700 కుటుంబాలు ఉన్నాయి. సీసీ రోడ్డు పనులను మధ్యలో వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాల్లోతు గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ గ్రామ ప్రజలే కాకుండా మోసం, రాస్పెల్లి, గజ్జిగూడ, జంబుగ, సారసాల గ్రామాల ప్రజలు కౌటాల, బాబాసాగర్, డబ్బా గ్రామాలకు వెళ్లే వారు ఈ గ్రామం మీదుగానే ప్రయాణిస్తుంటారు. రోడ్డు బాగా లేకపోవడంతో ఈజ్‌గాం మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా వదిలివేసిన రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది అవుతోంది



రోడ్డుపై బురద నిల్వ ఉండటంతో ఇబ్బంది అవుతోంది. వర్షం కురిసినప్పుడు నడవ లేని పరిస్థితి. బురదతో జారి పడిపోతున్నాం. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడవాలంటే ఇబ్బందిగా ఉంది.

– దండ్రె మోహన్‌రావు, ఆరెగూడ

పనులు పూర్తి చేయాలి



చిన్నపాటి వర్షానికే బురదగా మారుతోంది. ఆటోలు రావడం లేదు. గ్రామ పొలిమేర వరకు బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. అసంపూర్తిగా వదిలివేసిన పనులను అధికారులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలి.

– బీమాన్‌కార్ గుర్కయ్య, ఆరెగూడ

మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దహెగాం: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



కౌటాలలో ధర్నా చేస్తున్న కార్మికులు



తిర్యాణి: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్/కాగజ్‌నగర్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.8 ప్రకారం వేతనాలు ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ సవరించడంతోపాటు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, సత్తమ్మ, గంగమణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపడుతామని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమచారి హెచ్చరించారు. ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన టోకెన్ సమ్మెలో ఆయన, కార్మికులు పాల్గొన్నారు.

దహెగాం: ఎమ్మార్సీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు గురిజాల లలిత, కార్మికులు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగుల తిరుపతి, కార్మికులు ముత్యం పద్మ, విజయ, లక్ష్మి, పార్వతి, సుమిత్ర, మల్లక్క, దుర్గుబాయి పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.శారద మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. హంస, విమల, లక్ష్మి, పద్మ, తార, కమల తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్మికులు లక్ష్మి, తార, దేవక్క, విజయ ఉన్నారు.

టీచర్లే వంట చేసి వడ్డిస్తూ..



వంట చేస్తున్న టీచర్లు

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెతో సోమవారం పలు పాఠశాలల ఉపాధ్యాయులు వంట చేశారు. కెరమెరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వంట చేసి పిల్లలకు భోజనం వడ్డిస్తున్నారు.

కొనసాగుతున్న సమ్మె



దహెగాం: సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు



కౌటాలసమ్మెలో నినాదాలు చేస్తున్న కార్మికులు

దహెగాం/కెరమెరి/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్/పెంచికల్‌పేట్/తిర్యాణి/రెబ్బెన: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం నాటికి ఐదో రోజూ చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను రెగ్యూలర్ చేయాలని, కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దహెగాంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగుల తిరుపతి, తిర్యాణిలో సమ్మెకు తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు భగవంత్‌రావు మద్దతు తెలిపారు. కెరమెరిలో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గణేశ్‌రాథోడ్, రెబ్బెనలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, లక్ష్మి, దేవాజీ, మహేందర్, లక్ష్మి పాల్గొన్నారు.

శాకాంబరి మాతకు కూరగాయలతో అలంకరణ



కాగజ్‌నగర్‌రూరల్: అషాఢమాసం సందర్భంగా మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో గల శాకాంబరి మాత విగ్రహాన్ని సోమవారం కూరగాయలతో అలంకరించారు. వేద పండితులు నరహరిశర్మ, అర్చకుడు సంతోశ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సతీమణి రుక్మిణి, ఆలయ ధర్మకర్త మండలి సభ్యురాలు మమత, నీరజ, ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు, ఈవో వేణుగోపాల్‌గుప్తా, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తకాలు చదవాలి



కౌటాల: మాట్లాడుతున్న హెచ్‌ఎం హన్మంతు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు పుస్తకాలు చదవాలని హెచ్‌ఎం గావుడే హన్మంతు అన్నారు. పఠనోత్సవంలో భాగంగా మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి స్వాతంత్ర సమరయోధుల, మేధావుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలన్నారు. అన్ని పుస్తకాలు, వార్త పత్రికలు చదవడానికి ఆసక్తి కలిగి ఉండాలన్నారు. చదువుతోనే జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పాఠశాల చైర్మన్ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరి: విద్యార్థులకు చదవడం అలవాటు చేయాలని గోయగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నల్లగొండ రమేశ్ అన్నారు. మండలంలోని రింగన్‌ఘాట్, భీమన్‌గోంది పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులను చదివించారు. పఠనోత్సవంలో భాగంగా గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 15 వరకు నిర్వహించాలన్నారు. హెచ్‌ఎం రతన్, గీత, టీచర్ కిషన్ ఉన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దుర్గం రవీందర్

రెబ్బెన: ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12 నిర్వహించ తలపెట్టిన పాఠశాలలు, కళాశాలల బంద్‌ను విద్యార్థులు విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్ అన్నారు. సోమవారం రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యా సంస్థల బంద్‌కు యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయి, మండల కార్యదర్శి బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశోక్



సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఆసిఫాబాద్: పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా మోర సంపత్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అనుబంధంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఆలు గొట్టు తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శుల పదవులకు పోటీ లేకపోవడంతో.. పోటీలో ఉన్న ఇద్దరిని అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రకటించామని వెల్లడించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడు నారాయణ, గౌరవ సలహాదారులు శంకరయ్య, కౌటాల మండల కార్యదర్శి సామల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలి

చింతలమానెపల్లి: జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖమర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. పాఠ్య పుస్తకాలతోపాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తామన్న నోట్ పుస్తకాలు అందించాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

కౌటాల: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఎస్.సాయికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని వార సంతలో సోమవారం ఆయన తనిఖీలు చేపట్టి వ్యాపారుల వద్ద నుంచి ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని పలువురికి జరిమానా విధించారు.